BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీశ్రీ 'అనంతం' చరిత్రాత్మక స్వీయచరిత్ర | - డా॥. నందమూరి లక్ష్మీపార్వతి | 24 |
| 2. | 20వ శతాబ్దపు మహాకవి - శ్రీశ్రీ | - ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 27 |
| 3. | శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో వ్యక్తపరచిన అభ్యుదయ భావనలు మహాప్రస్థానంలో అభ్యుదయ భావాలు | - డా॥ కొయ్యా శ్రీనివాసులు | 31 |
| 4. | కష్టజీవుల కవి - శ్రీశ్రీ | - డా॥. ఎ. ఎ. నాగేంద్ర | 36 |
| 5. | అభ్యుదయ గీతం - శ్రీశ్రీ జయభేరి | - డా॥. జి. పార్వతి | 39 |
| 6. | శ్రీశ్రీ కవితా ప్రస్థానం | - డా॥. వి. శ్రీదేవి | 41 |
| 7. | శ్రీశ్రీమహాప్రస్థానం - మహాప్రస్థానం గేయ ప్రాధాన్యం | - డా॥. సి. పి. లక్ష్మీ ప్రసూన | 45 |
| 8. | శ్రీశ్రీ కవిత్వం - మానవతావాదం | - గజ్జెల ప్రమీల | 48 |
| 9. | అభ్యుదయ కవిత్వ ఉద్యమ రథసారథి - శ్రీశ్రీ | - డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు | 52 |
| 10. | శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సామాజిక చిత్రణ | - డా॥. ఇ. వాసు | 55 |
| 11. | మహా ప్రస్థానం - ఒక పరిశీలన | - డా॥. బి. వెంకటయ్య | 58 |
| 12. | మహాప్రస్థానం - శ్రీశ్రీలోని సంప్రదాయ వాసనలు | - మడకశిర రాజేశ్వరి | 60 |
| 13. | శ్రీ శ్రీ కంద పద్య రచనా చమత్కృతి | - డా॥. రాంభట్ల వేంకటరాయ శర్మ, | 64 |
| 14. | మరోప్రపంచాన్ని కలగన్న శ్రీశ్రీ మహాప్రస్థానం | - డా॥. పల్లా కృష్ణ | 70 |
| 15. | శ్రీ శ్రీ ప్రతిజ్ఞ - అభ్యుదయ దృక్పథం | - డా॥. బూర్గుల స్వరూప & - డా॥. జె. తిరుపతయ్య | 74 |
| 16. | శ్రీశ్రీ 'మహాప్రస్థానం' - అభ్యుదయ దృష్టి | - జి. యమున రాణి | 77 |
| 17. | "శ్రీ శ్రీ కవిత్వంలో సామాజిక చైతన్యం" | - డా॥. ఎం. ఫామిదబేగం | 82 |
| 18. | శ్రామిక జీవన గీతం - శ్రీశ్రీ 'ప్రతిజ్ఞా' | - ఎస్. శశికళ | 85 |
| 19. | శ్రీశ్రీ మహా ప్రస్థానం - సామాజిక దృక్పథం | - డా॥. పలివెల చిరంజీవిరావు | 89 |
| 20. | శ్రామిక చైతన్యమే శ్రీశ్రీ 'మహాప్రస్థానం' | - భూక్యా కాశీరామ్ | 93 |
| 21. | శ్రీశ్రీ సందేశం | - పోతురాజు దుర్గాదేవి | 97 |
| 22. | సరోజాశ్రీశ్రీ జ్ఞాపకాలు - శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం | - డా॥. బి. భీమమ్మ | 100 |
| 23. | శ్రీశ్రీ - అనంతం | - శ్రీ పేరి | 105 |
| 24. | శ్రీ శ్రీ సాహిత్యంలో మహాప్రస్థానం | - వేమూరి కమలాకర్ సుజాత | 111 |
| 25. | శ్రీశ్రీ - ప్రయోగశీలత | - డా॥. నల్లపనేని విజయలక్ష్మి | 115 |

# మరోప్రపంచాన్ని కలగన్న శ్రీశ్రీ మహాప్రస్థానం

– డా॥. పల్లె కృష్ణ, వైస్ ప్రిన్సిపల్, తెలుగు ఉపన్యాసకులు, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఒక సామాజిక వ్యవస్థ నుంచి అంతకన్నా ఉన్నతమైన సామాజిక వ్యవస్థలోకి పురోగమించి, ప్రపంచాన్ని వర్గ రహితంగా రూపొందించడమే అభ్యుదయం. ఆర్థిక, సామాజిక వ్యవస్థ పునాదిగా రూపొందిన మార్క్సిస్ట్ దృక్పథం అభ్యుదయవాదం. మార్క్సిజమ్-భౌతికవాదం, వాస్తవికతావాదం ప్రాతిపదికగా అభ్యుదయ కవిత్వం జనించింది. పెట్టుబడిదారీ వ్యవస్థను, సామ్రాజ్యవాద తత్త్వాన్ని, యుద్ధోన్మాదాన్ని నిరసించడం; ఆకలి, దారిద్ర్యం, అసమానత, పరాధీనత మొదలైన సామాజిక రుగ్మతల్ని నిర్మూలించడానికి కృషి చేయడం, మతవర్ణ వర్గ భేదాల్ని, జాత్యహంకారాన్నీ సమూలంగా పెల్ల గించడం దాని లక్ష్యం. జనంవైపు ఉండి, జనంతో కలిసి, జనం కోసం పోరాడే కవి అభ్యుదయ కవి. అభ్యుదయ కవి అంటే మొదట గుర్తుకు వచ్చే మహా కవి శ్రీశ్రీ.

“హృదయం ఎలా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చాతనవును. పద్యాలు చదువుతో వుంటే, ఇవి మాటలు కావు, అక్షరాలు కావు - ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు - అతని హృదయంలోంచి మన హృదయంలోకి డైరెక్ట్‌గా పంపిన ఉత్సాహాలు, నెత్తురుకాలవ లనిపిస్తుంది. ఎందుకంటే -

కృష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు.

కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ” - అని “మహాప్రస్థానం”లో ‘చలం’ ‘యోగ్యతా పత్రం’ ద్వారా ‘శ్రీశ్రీ’ అంతరంగాన్ని ఆవిష్కరించారు.

30-04-1910 విశాఖ పట్నంలో జన్మించిన శ్రీరంగం శ్రీనివాసరావు గారి తల్లిదండ్రులు - అప్పలకొండ, పూడిపెద్ది వెంకటరమణయ్యగార్లు. వీరి రచనా వ్యాసంగంలో ప్రభవ, మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం, సిప్రాలి, మరోప్రపంచం, చరమరాత్రి, చైనాయానం, అనంతం వంటి రచనలు ఉన్నాయి. “1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ కవిత్యోద్యమ మూల విరాట్టు ‘శ్రీశ్రీ’. భావకవిత్వానికి విరుద్ధంగా జెండా ఎత్తుటతోనే కాక, శ్రామిక వర్గచైతన్యం ఊపిరిగాగల ఒక సరికొత్త కవితారీతికి పాదులు వేసిన స్రష్ట, వాస్తవికతతో పాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘచైతన్యంను సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ.” - అంటారు సి.నారాయణరెడ్డి.

శ్రీశ్రీ రచనలను పరిశీలిస్తే మొదటి దశలో కాల్పనికతా ప్రభావం, రెండవ దశలో మార్క్సువాద ప్రభావం, మూడవ దశలో ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంత ప్రభావాలు మనకు కనిపిస్తాయని ఆచార్య కె.వి.ఆర్.నరసింహులుగారు ఆధునికాంధ్ర కవితా సమీక్షలో తెలిపారు. శ్రీశ్రీ ‘ప్రభవ’లో ప్రకృతి గీతాలు, ప్రణయగీతాలు, ప్రకీర్ణగీతాలు కని పించగా, ‘సుప్తాస్థికలు’ గీతంతో అతనిలోని నిశిత భావనా శక్తి వెలుగు చూడగా, ‘మహాప్రస్థానం’ ద్వారా అభ్యుదయ కవి ఉదయించి, జ్వలించాడని చెప్పవచ్చు. శ్రీశ్రీలో మొదట పద్యకవి, భావకవి కనిపించిన తర్వాత అభ్యుదయ కవి, విప్లవ కవి కనిపిస్తారని వీరి రచనలు ద్వారా తెలుస్తుంది.

“1930 వరకు ఆంధ్రదేశం నన్ను నడిపించింది, 1930 తర్వాత ఆంధ్రదేశాన్ని నేను నడిపించాను.” అంటారు శ్రీశ్రీ. మానవ నాగరికత పరిణామంలో మనిషి నాగ రికుడయ్యే కొద్ది తన మూలాల్ని మరచిపోతున్నాడు.

శ్రీశ్రీ సమాజంలో వస్తున్న మార్పులను నిశితంగా పరిశీలించి శ్రమజీవుల పట్ల తమ బాధ్యతాయుతమైన పాత్రను కొనసాగించారు. సరళత, స్పష్టతలతో సమాజ శ్రేయస్సు కోరుకుంటూ, సామాన్యులకు ప్రాధాన్యత కల్పిస్తూ తమ కవిత్వంతో మేలుకొలుపు పలికారు.

1930లో శ్రీశ్రీలో అపూర్వమైన అలజడి మొదలై, స్వరాజ్య శంఖధ్వనులు ఒకవైపు, పీడిత ప్రజానీకం మరోవైపు కనిపించింది. ఆయన అంతరంగంలో దాగివున్న చైతన్యం ఎగసిపడి 1933లో 'జయభేరి' వచన గేయ ఖండిక ద్వారా అభ్యుదయ కవిత్వానికి నాంది పలుకుతూ వాడుక భాషలో తమ గొంతుకతో -

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!
నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!" అంటూ కొనసాగే గేయఖండికలో వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంలో భాగస్వామ్యం అని తెలియజేశారు.

స్విన్‌బర్న్, ఎడ్గార్ ఎలెన్ పో, గోర్కి వంటి ప్రాశ్చాత్య రచయితల ప్రభావం, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ శాస్త్రం, మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతిక వాద సిద్ధాంతాల్ని అధ్యయనం చేసి, దోపిడీకి గురౌవుతున్న కార్మిక, శ్రామిక వర్గాల్ని అంతటినీ 'మరో ప్రపంచం' పిలిచింది అంటూ

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరోప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పదండి త్రోసుకు!
పోదాం, పోదాం పైపైకి!
అగ్ని కిరీటపు ధగధగలు,
ఎర్రబావుటా నిగనిగలు,
హోమజ్వాలల భుగభుగలు ? అని 1934లో 'మహాప్రస్థానం'లో నూతన ప్రపంచం పట్ల కుతూహలాన్ని రేకెత్తిస్తూ, సమసమాజ నిర్మాణానికి పరుగులు పెట్టిస్తూ, సమర గేయం రచించారు శ్రీశ్రీ. ఇది అభ్యుదయ గేయానికి నాంది గేయంగా మారి, "మహాప్రస్థానం" గేయ సంపుటికి మకుటాయమానంగా నిలిచింది. సమకాలీన సమాజాన్ని, అంతర్జాతీయ పరిస్థితుల్ని సమన్వయించుకుని సామాజిక విప్లవాన్ని ఆశించి విప్లవ శంఖం పూరించాడని చెప్పవచ్చు. ఇందులోని 'మరోప్రపంచం' స్వర్గమో, కైలాసమో కాదు. ధరిత్రీ నిండా నిండిన సమసమాజం. ఇది రష్యా విప్లవంతో ప్రభావితమై, విశ్వమంతటా వర్గరహిత సమాజాన్ని నిర్మించేందుకు తోడ్పడిందనవచ్చు.

సమష్టి చైతన్యానికి ప్రతిబింబంగా, పీడిత జన సముద్ధరణ లక్ష్యంగా ముందుకు అడుగులు వేసి, కవిత్వాన్ని జీవితానికి దగ్గరగా తీసుకువచ్చి అభ్యుదయ కవిత్వానికి మార్గదర్శకుడైనాడు శ్రీశ్రీ.

"నేడే, ఈనాడే, ఈనాడే-
జగమంతా బలి వితర్ది!
నరజాతికి పరివర్తన!
నవజీవన శుభసమయం!
అభ్యుదయం !" అంటూ అభ్యుదయవాదులకు పిలుపునిచ్చారు. శ్రీశ్రీని నవ్య కవితాయుగకర్తగా, అభ్యుదయ కవితా ప్రవక్తగా ఈ యుగకవులు గుర్తించడం జరిగింది. "పాత పదాలు, డిక్షన్ వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవి, జీవితంలోవీ ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ" అని చలంగారు 'మహాప్రస్థానం'

'యోగ్యతా పత్రం'లో తెలియచేశారు. ఈ విశ్లేషణ శ్రీశ్రీ కవిత్వ స్వరూపానికి సంబంధించింది. అభ్యుదయ కవిత్వ రచనా శైలి, సూత్రాలు ఇంతకుముందు రచనా విధానాలకన్నా భిన్నమైనవి, బలమైనవి.

"లోకపుటన్యాయాలూ, కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ పరిష్కరించే, బహిష్కరించే బాటలు తీస్తూ, పాటలు వ్రాస్తూ...

కార్మికలోకపు కల్యానానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణంగా, సమర్చనంగా...

నాలో కదలే నవ్యకవిత్వం" అని ప్రతిజ్ఞ ద్వారా కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపచేసే గొడ్డలి,రంపం, కొడవలి, నాగలి వంటి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు నా వినిపించే, విరచించే నవీన రీతికి ప్రాణం!, ప్రణవం అంటారు. కార్మిక లోకపు కల్యాణం కోసం, శ్రామిక లోకపు సౌభాగ్యం కోసం కవిత్వం రాయడంతో తదనంతర కవులకు శ్రీశ్రీ మార్గ దర్శకులు అయ్యారు.

ఒక నిర్దిష్ట కవితా ప్రయోజనంతో తెలుగు కవితా రంగంలోకి ప్రవేశించారు శ్రీశ్రీ. కదలిక, మార్పు, జాగృతి, పురోగమనం మొదలైనవి కవితా ప్రయోజనాలుగా, కార్మిక లోకపు కళ్యాణానికి తన కవిత్వం విప్లవశంఖం కావా లంటూ-

"కదిలేదీ, కదిలించేదీ,
మారేదీ మార్పించేదీ,
మునుముందుకు సాగించేదీ,
పెనునిద్దుర వదలించేదీ,
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ" 'నవ కవిత' అని తమ నూతన లక్ష్యాల్ని స్పష్టపరిచి అభ్యుదయ కవిత్వానికి బలమైన ప్రతినిధిగా నిలిచారు శ్రీశ్రీ. లోకంలోని అన్యాయాలను ప్రశ్నించి ప్రజలను చైతన్యవంతం చేయడంలో శ్రీశ్రీ గారికి సాటిలేరు అని చెప్పవచ్చు. అంతేకాదు ప్రపంచంలో జరుగుతున్న ప్రభుత్వ పతనాలు, యుద్ధాలు, విప్లవాలు మానవజాతి పురోగమనానికి దోహదం చేసే తీరుతెన్నులు శ్రీశ్రీ కనుగొన్నారు.

కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ !
కవితామయమేనోయ్ అన్నీ !

"కాదేదీ కవిత కనర్హం" అంటూ 'ఋక్కులు' అనే కవిత ద్వారా జగత్తులో అన్నింటిలోనూ ఒక విషయం, విశేషం ఉంటుందని కవిత్వానికి అనర్హమైనదంటూ ఏదీ లేదని, వాటి చుట్టూ ఉండే వాతావరణం వల్ల, వాటి ఉపయోగ, వినియోగాల వల్ల ఎన్నో విషయాలు స్ఫురింప చేస్తారు. ఇటువంటి గొప్ప దార్శనిక దృష్టి ఉన్నావాడే శ్రీశ్రీ. కవిత్వం మంచి శిల్పం ఉండి పాఠకులను ఆకట్టు కోగలగాలి అని, ప్రపంచం ఒక పద్మవ్యూహంగా, కవిత్వం ఒక తీరని దాహంగా కూడా అభివర్ణించారు.

శ్రీశ్రీ కవిత్వం తాడితులు, పీడితుల అభ్యున్నతి కోసం రచించబడింది. ప్రపంచంలో ఎవరు ఎవరికీ బానిసలు గారని చెబుతూ అనాదిగా భరిస్తున్న బానిసత్వపు సంకెళ్ళను బద్దలు చేయమంటూ 'అవతారం' కవితలో -

"యముని మహీషపు లోహపు ఘంటలు
మబ్బుచాటున
ఖణేల్మన్నాయి!
నరకలోకపు జాగిలమ్ములు
గొలుసు త్రెంచుకు
ఉరికిపడ్డాయి!....
పుడమి తల్లికి
పురుటి నొప్పులు
కొత్త సృష్టిని స్ఫురింపించాయి!" అని అభ్యుదయ కవిత్వ లక్షణాలలో ఒకటైన "తిరుగుబాటు"ను సూచిస్తూ, తరతరాల బానిసత్వాన్ని విదిలించుకుని కొత్త సృష్టికి నాంది పలికారు.

గతితార్కిక భౌతికవాదానికి నిలువుటద్దం వంటిది "దేశచరిత్రలు" గేయఖండిక. శ్రీశ్రీ ఈ గేయంలో-

"ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం" అంటూ...
"ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు !

దాచేస్తే దాగని సత్యం" అని హెచ్చరిస్తూ, చారిత్రక దృక్పథాన్ని నిష్కర్షగా ప్రకటించారు. "నరజాతి చరిత్ర సమస్తం - దరిద్రులను కాల్చుకు తినడం" అని వ్యాక్యానించారు. వర్గసంఘర్షణ సిద్ధాంతాన్ని అత్యంత స్పష్టంగా ప్రతిపాదించారు. మానవ జాతి చరిత్ర సమస్తం "వర్గసంఘర్షణ ఫలితమే" అనే మార్క్స్ సిద్ధాంతాన్ని -

"పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను" అని ఒక్క మాటలో తెలుపుతూ ఆశ్చర్యకరమైన నైపుణ్యతను ప్రదర్శించారు.

"జగన్నాథుని రథచక్రాలు" అభ్యుదయ కవి స్వప్నం నిజమవుతుందని శ్రీశ్రీ ఈ ఖండికలో ప్రకటించారు. ఆకాశ వీధిలో హడావుడిగా పోతున్న జగన్నాథుని రథచక్రాలను భూమార్గం పట్టించి ఆ రథచక్రాల ప్రళయ ఘోషలో భూకంపం పుట్టించారు." వస్తున్నా యొస్తున్నాయ్... జగన్నాథ రథచక్రాల్" అని రథచక్రాల ఆగమనాన్ని సామ్యవాద విప్లవంతో సూచించారు. జగన్నాథుని రథం మరోప్రపంచపు సంకేతంగా "ఈలోకం మీదేనండి, మీ రాజ్యం మీ రేలండి!" అని ముగించి రాజ్యాధికారాన్ని వ్యక్తుల నుంచి తప్పించి సమాజానికి ఇప్పించడమే కవిత్వపు తుది లక్ష్యం అన్నాడు. శ్రామికులతో 'తిరుగుబాటు మా వేదాంతం' అనిపించారు.

శ్రామికులు, కార్మికులు కర్షకులు తమకు ఎదురైన సమస్యలను ఎదుర్కొంటూ ఐకమత్యంగా పోరాటం చేసినపుడు మాత్రమే విజయం సాధించవచ్చని, దోపిడీ వ్యవస్థ నుంచి, ఈ పీడిత సమాజం నుండి సామ్యవాద వ్యవస్థకి, సమసమాజ వ్యవస్థకి పయనించడమే మహాప్రస్థానం అంటారు.

మహాప్రస్థానంలోని గేయ ఖండికల ద్వారా శ్రామికులు, అణగారిన బడుగు, బలహీన వర్గాలు, ఇలా ఒకరేమిటి వెనుకబాటుకు గురైన ప్రజానీకాన్ని తమ కవిత్వంతో అభ్యుదయంవైపు నడిపించారు శ్రీశ్రీ. శ్రమ దోపిడీ నుండి బయటపడడానికి అతి సరళ పదాలతో సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో కవిత్వ రచనకు నాంది పలికి, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజాన్ని కలగన్నారు. నవ సమాజ నిర్మాణంలో మనవంతు పాత్ర నిర్వహించాలని అన్నారు. ఆధునిక విప్లవ కవిత్వపు రథసారథిగా కొనియాడబడ్డారు. నవ భారతావని నిర్మాణం కేవలం యువకుల వలనే సాధ్యమవుతుందని, కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల కష్టాలు, సమస్యలు పేదరికం, ఆకలిమంటలు వంటి కవితా వస్తువులే ఇతివృత్తంగా, విశ్వమంతటా సమసమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేశారు శ్రీశ్రీ. 1933-47 మధ్యకాలంలో శ్రీశ్రీ రాసిన 41 గేయ ఖండికలతో 'మహాప్రస్థానం' కవితాసంపుటిని 1950లో ప్రచురించారు.

**ఆధార గ్రంథాలు :**

1. మహా ప్రస్థానం - శ్రీశ్రీ
2. తెలుగు సాహిత్య సమీక్ష - (రెండవ సంపుటం) - డా. జి. నాగయ్య.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.

❖❖❖